

## రామయ్యకు రూ.45 లక్షల విలువైన స్వర్ణ తులసి దళాల సమర్పణ



ఆలయ ఈవోకు బంగారు తులసీదళాలను అందజేస్తున్న దాతలు

భద్రాచలం, డిసెంబర్ 23: తమిళనాడులోని కొయంబత్తూరుకు చెందిన బాలాజీ, శారద దంపతులు భద్రాచలం సీతారామచంద్రస్వామికి రూ.45 లక్షల విలువైన 109 స్వర్ణ తులసీదళాలు చేయించారు. శనివారం వాటిని ఆలయ ఈవో రమాదేవికి అందించారు. దాతలను దేవస్థాన అధికారులు సత్కరించారు. స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు.

### ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం దంపతుల పూజలు

ముక్కోటి ఏకాదశి సందర్భంగా భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు, ప్రవీణ దంపతులు శనివారం భద్రాద్రి రామాలయ సన్నిధిలో ప్రత్యేక పూజలు చేశారు. తొలుత ఉత్తర ద్వారం ద్వారా దర్శనమిచ్చిన స్వామివారిని దర్శించుకున్నారు. ఎమ్మెల్యే వెంట నాయకులు నక్కా ప్రసాద్, మామిడి పుల్లారావు, హరిశ్చంద్ర నాయక్, చావా లక్ష్మీనారాయణ, కురిచేటి శ్రీనివాస్ పాల్గొన్నారు.



పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు, ప్రవీణ దంపతులు

### రామయ్య సేవలో డిప్యూటీ సీఎం భట్టి సతీమణి నందిని

భద్రాద్రి రామాలయ ఉత్తర ద్వారం దర్శనమిచ్చిన భద్రాద్రి రామయ్యను డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క సతీమణి, అమ్మ ఫౌండేషన్ చైర్‌పర్సన్ నందిని దర్శించుకున్నారు. అనంతరం అంతరాలయంలోని మూలవరులను దర్శించుకున్నారు.



పూజల్లో పాల్గొన్న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సతీమణి నందిని





స్వామివారిని సెల్‌ఫోన్‌లో బంధిస్తున్న దృశ్యం



మెట్లమార్గంలో వెళ్తున్న భక్తులు



రామయ్యకు మొక్కుతున్న భక్తులు

# అల వైకుంఠము ఇలకు దిగి వచ్చె!

- భద్రాద్రికి ముక్కోటి ఏకాదశి శోభ
- ఉత్తర ద్వారం ద్వారా దర్శనమిచ్చిన రామయ్య



భద్రాచలం, డిసెంబర్ 23: ఆదివారం తెల్లవారు జాము.. భద్రాద్రి రామాలయ ఉత్తర ద్వారం వద్ద భక్త జన సంద్రం.. జగమేలు జగదభిరాముడి దర్శన భాగ్యం కోసం నిరీక్షణ.. మెల్లమెల్లగా తెరచుకుంటున్న ద్వారాలు.. ' జై శ్రీరామ.. జై జై రామ..' అని భక్తుల జయ జయ ధ్వానాలు.. మంగళ వాద్యాలు, వేద మంత్ర ఘోష ప్రతిధ్వనులు.. ఎప్పుడెప్పుడా.. అని ఎదురు చూస్తున్న ఆ క్షణాలు రానే వచ్చాయి.. సీతాలక్ష్మణ సమేతుడై రామయ్య తేజోస్వరూపుడిగా దర్శనమిచ్చారు.. అల వైకుంఠం ఇలకు దిగి వచ్చినట్లుగా భద్రగిరి పునీతమైంది.. ఆ దృశ్యాన్ని చూసి భక్తులు పరవశించారు. ఈ అపురూప ఘట్టం శనివారం భద్రాచలంలో ఆవిష్కృతమైంది. ముక్కోటి వైకుంఠ ఏకాదశి అధ్యయనోత్సవాల్లో భాగంగా గరుడ వాహనంపై రామయ్య తండ్రి, గజ వాహనంపై సీతమ్మతల్లి, హనుమత్ వాహనంపై లక్ష్మణ స్వామి దర్శనమిచ్చారు. అంతకుముందు భద్రాచలం తహసీల్దార్ శ్రీనివాస్‌తో అర్చకులు స్వామివారికి అభిషేకం చేయించారు. అర్చకులు స్వామివారికి విశేష ఆరాధనలు, అష్టోత్తర శతనామార్చన చేపట్టారు. చతుర్వేదాలు, గరుడ ప్రబంధాలు, ఇతిహాసాలు, శరణాగతి, గజ్జ గరుడ దండకం, దాశరథి శతకాన్ని పఠించారు. వైకుంఠ రాముడికి అష్టోత్తర శత హారతినిచ్చారు. ఉదయం 6 గంటలకు తిరువీధి సేవ ప్రారంభమైంది. ఆస్థాన స్థానాచార్యులు కేఈ స్థలశాయి ముక్కోటి ఏకాదశి విశిష్టతను వివరించారు. వేడుకలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సతీమణి మల్లు నందిని, ఎమ్మెల్యేలు తెల్లం వెంకట్రావు, పాయం వెంకటేశ్వర్లు, కోరం కనకయ్య, జారే ఆదినారాయణ, భద్రాద్రి కలెక్టర్ ప్రియాంక ఆల, ఎస్పీ డాక్టర్ వినీత్ గంగన్న, ఖమ్మం కలెక్టర్ వీపీ గౌతమ్, ఐటీడీఏ పీవో ప్రతీక్ జైన్, అదనపు కలెక్టర్లు రాంబాబు, మధుసూదనరాజు, భద్రాచలం ఏఎస్పీ పరితోశ్ పంకజ్, ఆలయ ఈవో రమాదేవి పాల్గొన్నారు. మణుగూరు, ఇల్లెందు, పాల్వంచ డీఎస్పీలు రాఘవేంద్రరావు, కేవీ రమణమూర్తి, వెంకటేశ్ ఆధ్వర్యంలో పోలీస్ సిబ్బంది బందోబస్తు నిర్వహించారు.



ఉత్తరద్వారంలో భక్తులకు దర్శనమిస్తున్న సీతారాములు



తరలివచ్చిన అశేష భక్తజనం

### పర్ణశాలలో...



వైకుంఠ ఏకాదశి ఉత్తరద్వారంలో దర్శనమిస్తున్న పర్ణశాల రాముడు

పర్ణశాల, డిసెంబర్ 23: భద్రాద్రి రామాలయానికి అనుబంధ ఆలయమైన పర్ణశాల రామాలయ సన్నిధిలో శనివారం తెల్లవారుజామున ముక్కోటి వైకుంఠ ఏకాదశి సందర్భంగా రామయ్య ఉత్తర ద్వారం ద్వారా భక్తులకు దర్శనమిచ్చారు. అర్చకులు వైకుంఠ ఏకాదశి విశిష్టతను వివరించారు. అనంతరం ఆలయ అధికారులు, అర్చకులు స్వామివారిని పల్లకీపై ఊరేగిస్తూ గ్రామ పురవీధుల్లో తిరువీధి సేవ నిర్వహించారు. వేడుకలో ఎంపీడీవో ముత్యాలరావు, తహసీల్దార్ చంద్రశేఖర్‌రావు, స్పెషల్ ఆఫీసర్ చంద్రమౌళి, సీఐ రమేశ్, అర్చకులు శేషకిరణ్‌కుమార్ చార్యులు, భరద్వాజాచార్యులు, రాజగోపాలాచార్యులు, అమరవాది శ్రీకాంతాచార్యులు, నరసింహాచార్యులు, ఆలయ అధికారులు పాల్గొన్నారు.

### సింగరేణి ఆవిర్భావ వేడుకల్లో ఎమ్మెల్యే రాగమయి

సత్తుపల్లి, డిసెంబర్ 23: సింగరేణి ఆవిర్భావ వేడుకల సందర్భంగా స్థానిక జేవీఆర్ ఓసీని సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా కార్మికులకు ఆమె ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం కార్మికుల ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పీవో వెంకటాచారితో ఆమె మాట్లాడుతూ అప్‌లోడింగ్ కార్మికుల జీతభత్యాలను ఆల స్యం కాకుండా వెంటనే చెల్లించాలని కోరా రు. అధికారులు, యూనియన్ల నాయకు లు రామారావు, త్యాగరాజు, ఆల్బట్టి, చెన్నకేశవరావు, నాగప్రకాశ్, భట్టి విక్రమార్క, తోకలరామస్వామి పాల్గొన్నారు.

### అక్రమంగా నిల్వ చేసిన ఔషధ డ్రగ్స్ స్వాధీనం



తల్లాడ, డిసెంబర్ 23: మండలంలోని అన్నారుగూడెం కాటన్ పార్కులోని బయో ఫార్మసీ ఫ్యాక్టరీలో అనుమతులు లేకుండా అక్రమంగా తయారు చేసిన ఔషధ నిల్వలను రాష్ట్ర డ్రగ్స్ కంట్రోల్ అధికారులు పట్టుకున్నారు. ఔషధ నియంత్రణ శాఖ డిప్యూటీ డైరెక్టర్ రాజవర్ధనాచారి, అసిస్టెంట్ డైరెక్టర్ ప్రసాద్, డ్రగ్స్ ఇన్‌స్పెక్టర్ దేవేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం రాత్రి డీసీ అధికారులు బయో ఫార్మసీ ఫ్యాక్టరీలో దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో 935 కిలోల డ్రగ్స్ పౌడర్ నిల్వలను స్వాధీనం చేసుకున్నారు. దాడుల్లో ఏసీపీ రెహమాన్, సీఐ సాగర్ పాల్గొన్నారు. అక్రమ ఔషధ డ్రగ్స్ తయారీ సూత్రదారి సతీశ్‌రెడ్డిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## దేశంలోనే నంబర్‌వన్ స్థానం మన సింగరేణిది

- అంగరంగ వైభవంగా సింగరేణి డే వేడుకలు
- ఈ ఏడాది లక్ష్యాని కి చేరువగా సంస్థ
- సింగరేణి డైరెక్టర్(పా) బలరాం



సింగరేణి పతాకాన్ని ఎగురవేసి గౌరవ వందనం చేస్తున్న డైరెక్టర్ (పా)




వివిధ డిపార్ట్‌మెంట్ల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను పరిశీలిస్తున్న డైరెక్టర్లు

కొత్తగూడెం సింగరేణి, డిసెంబర్ 23 : సింగరేణి సంస్థ బొగ్గు ఉత్పత్తి, ఉత్పాదకతతోపాటు సంక్షేమం విషయంలో కూడా దేశంలోనే నంబర్‌వన్ స్థానంలో ఉందని సింగరేణి డైరెక్టర్(పా) ఎన్.బలరాం అన్నారు. శనివారం సింగరేణి ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా స్థానిక ప్రకాశం స్టేడియం గ్రౌండ్‌లో జరిగిన సెంట్రల్ వేడుకల్లో డైరెక్టర్(పా) ముఖ్యఅతిథిగా పాల్గొని సింగరేణి పతాకాన్ని ఎగురవేశారు. అనంతరం ఇతర డైరెక్టర్లు, జీఎంలతో కలిసి వివిధ డిపార్ట్‌మెంట్లు ఏర్పాటుచేసిన స్టాల్స్‌ను ప్రారంభించారు. సింగరేణి డే వేడుకల పైలాన్ బెలూన్‌ను ఎగురవేశారు. సాయంత్రం జరిగిన సింగరేణి డే వేడుకల ముగింపు సభలో డైరెక్టర్(పా) బలరాం సింగరేణి సంస్థ సీఎండీ శ్రీధర్ సందేశాన్ని వినిపించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దేశంలో అనేక పరిశ్రమలు ఉన్నప్పటికీ మన సింగరేణి సంస్థకు ప్రత్యేక స్థానం ఉందని, స్వాతంత్య్రం రాకముందు 58 సంవత్సరాల ముందే 1889 సంవత్సరంలో ఆవిర్భవించిందని చెప్పారు. 1921 డిసెంబర్ 23వ తేదీన సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్‌గా రూపుదిద్దుకుందని వివరించారు. అప్పటి నుంచి స్వాతంత్య్రానికి ముందు, స్వాతంత్య్రం వచ్చిన తర్వాత దేశ సేవలో పాలుపంచుకుంటున్నామన్నారు. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం తర్వాత సింగరేణి అన్ని రంగాల్లోనూ అత్యున్నత స్థాయికి చేరుకుందన్నారు. గత ఏడాది సింగరేణి చరిత్రలోనే అత్యధికంగా 671 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి చేసి 667 లక్షల టన్నుల బొగ్గును రవాణా చేయడం ద్వారా చరిత్రలోనే అత్యధికంగా రూ.33 వేల కోట్ల టర్నోవర్ సాధించడంతో రూ.2222 కోట్ల లాభాలను ఆర్జించామని చెప్పారు. ఇందులో 32 శాతం లాభాల వాటా, కార్మికులకు బోనస్‌గా పంపిణీ చేసిన ఘనత సింగరేణికే దక్కుతుందన్నారు. దేశ విద్యుత్ అవసరాలను తీరుస్తుందన్నారు. ప్రస్తుత పోటీ మార్కెట్‌లో నిలబడాలంటే కేవలం బొగ్గు ఉత్పత్తిపైనే ఆధారపడకుండా థర్మల్ విద్యుత్ ఉత్పత్తి, సోలార్ విద్యుత్ ఉత్పత్తితో పాటు ఇతర రాష్ట్రాల్లో బొగ్గు ఉత్పత్తి చేస్తున్న సంస్థ సింగరేణి మాత్రమేనని అన్నారు. సింగరేణి సంస్థ కేవలం బొగ్గు ఉత్పత్తి, టర్నోవర్, లాభాల్లోనే కాకుండా సంక్షేమంలో కూడా ముందంజలో ఉన్నామన్నారు. ఈ సందర్భంగా ఉత్తమ ప్రతిభ కనపర్చిన అధికారులు, ఉద్యోగులతో పాటు వివిధ క్రీడాంశాల్లో ప్రతిభ కనపర్చిన వారికి బహుమతులు అందించారు. అనంతరం జరిగిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో సింగరేణి డైరెక్టర్లు శ్రీనివాసరావు, వెంకటేశ్వరరెడ్డి, సత్యనారాయణరావు, పర్సనల్ జీఎంలు బసవయ్య, దీక్షితులు, కవితా నాయుడు, సూర్యనారాయణ, దామోదర్, హనుమంతరావు, అన్ని డిపార్ట్‌మెంట్ల జీఎంలు, ఏజీఎంలు , డీవై జీఎంలు, సిబ్బంది పాల్గొన్నారు.

### సింగరేణి ఆవిర్భావ వేడుకలు

మణుగూరు టౌన్, డిసెంబర్ 23: సింగరేణి మణుగూరు ఏరియా పీవీ కాలనీలోని భద్రాద్రి స్టేడియంలో ఆవిర్భావ వేడుకలు శనివారం జరిగాయి. సింగరేణి పతాకాన్ని ఏరియా జీఎం దుర్గం రామచందర్ ఆవిష్కరించి, సింగరేణీయులకు శుభాకాంక్షలు తెలిపారు. ఆయన మాట్లాడుతూ.. సింగరేణి ఎంతో పురోగతి సాధిస్తున్నదని, ఇతర రాష్ట్రాలకు విస్తరిస్తున్నదని, విద్యుత్ ఉత్పాదకతో సత్తా చాటుతున్నదని అన్నారు. రక్షణ, పర్యావరణ పరిరక్షణలో అనేక జాతీయ, అంతర్జాతీయ అవార్డులు సొంతం చేసుకుందని చెప్పారు. ఎస్వోటూ జీఎం వీసం కృష్ణయ్య, అధికారులతో కలిసి స్టాల్స్, రక్తదాన శిబిరాలను ప్రారంభించారు. ఆహూతులను సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. కార్యక్రమంలో ఏజీఎం(సివిల్) వెంకటేశ్వర్లు, ఏఎస్‌వో వెంకటరమణ, పీకే ఓసీ పీవో లక్ష్మీపతి గౌడ్, ఎంఎన్‌జీఓసీ పీవో శ్రీనివాసాచారి, ఏజీఎం(కేపీయూజీ) వీరభద్రరావు, ఏజీఎం(ఈఅండ్‌ఎం) నర్సిరెడ్డి, డీవైసీఎంవో మేరీకుమారి తదితరులు పాల్గొన్నారు.



సింగరేణి పతాకాన్ని ఆవిష్కరిస్తున్న జీఎం దుర్గం రామచందర్

## ఏర్పాట్లలో లోపాలు.. భక్తుల పాలిట కష్టాలు

- 'ఉత్తర దర్శనం'లో స్పష్టంగా కనిపించిన పర్యవేక్షణ లోపం
- సెక్టార్లలో నించునే స్వామివారిని దర్శించుకున్న భక్తులు
- టికెట్లు ఉన్నా కూర్చుని చూడలేకపోయామని ఆవేదన



వీవీఐపీ సెక్టార్‌లో నిలబడే దైవదర్శనం చేసుకుంటున్న భక్తులు

భద్రాద్రి కొత్తగూడెం, డిసెంబర్ 23 (నమస్తే తెలంగాణ): భద్రాద్రి రామయ్యను ఉత్తర ద్వారం ద్వారా దర్శించుకునేందుకు టిక్కెట్లు కొనుక్కుని వచ్చిన భక్తులకు పాట్లు తప్పలేదు. సెక్టార్లలో వందలాది మంది భక్తులు నించునే స్వామివారిని దర్శించుకున్నారు. సెక్టార్లకు నియమితులైన అధికారులెవరూ అక్కడ కనిపించకపోవడంతో భక్తులు ఎవరికి ఫిర్యాదు చేయాలో పాలుపోక ఇబ్బంది పడ్డారు. కొందరు సెక్టార్ల వద్దకు కూడా రాలేకపోయారు. ఏటా ముక్కోటికి వీఐపీలు, వీవీఐపీలు, మంత్రులు రావడం కొంచెం హడావుడి ఉండేది. కానీ ఈసారి మంత్రైనా వేడుకకు హాజరు కాలేదు. మీడియాకు కేటాయించిన సెక్టార్‌లోకి సైతం ఇతరులు రావడంతో మీడియా ప్రతినిధులు బయటకు వెళ్లిపోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. విధుల్లో ఉన్న కొందరు తమకు సంబంధించిన వ్యక్తులను నిబంధనలకు వ్యతిరేకంగా గ్యాలరీలు, సెక్టార్లలోకి పంపినట్లు భక్తులు ఆరోపించారు. సౌండ్ సిస్టమ్ సక్రమంగా పనిచేయకపోవడంతో అర్చకుల వేదమంత్రాలు వినిపించ లేదని, ఏ ఒక్క సెక్టార్‌లోనూ కనీసం తాగునీటి వసతి కూడా లేదని భక్తులు ఆందోళన వ్యక్తం చేశారు. భక్తుల తాకిడి పెరిగినా వారికి సరిపడా సౌకర్యాలు కల్పించడంలో ఆలయ అధికారులు విఫలమయ్యారని పెదవి విరిచారు. ఆలయ పరిధిలోని సౌమిత్రి నిలయంలో కొందరు భక్తులు సౌకర్యాల లేమిపై ఫిర్యాదుల బాక్సులో చీటీలు వేసినట్లు తెలిసింది.

### తిరుమలేషుడిని దర్శించుకున్న పార్థసారథిరెడ్డి, సండ్ర

సత్తుపల్లి, డిసెంబర్ 23: తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామిని రాజ్యసభ సభ్యుడు బండి పార్థసారథిరెడ్డి, సత్తుపల్లి మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య దంపతులు దర్శించుకున్నారు. వైకుంఠ ఏకాదశి సందర్భంగా తిరుమలలో శనివారం జరిగిన ఉత్తరద్వార దర్శనానికి వారు హాజరయ్యారు. ఉత్తర ద్వారంలో దేవదేవుడిని వారు దర్శించుకున్నారు. శ్రీవారి ఆశీస్సులతో ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలని కోరుకున్నట్లు వారు తెలిపారు.



తిరుమల శ్రీవారి ఆలయంలో రాజ్యసభ సభ్యుడు బండి పార్థసారథిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య దంపతులు

### రాష్ట్రపతికి వీడ్కోలు పలికిన మంత్రి పొంగులేటి



రాష్ట్రపతి ద్రౌపది ముర్ము శీతాకాల విడిది పూర్తికావడంతో శనివారం హైదరాబాద్‌లోని విమానాశ్రయంలో సీఎం రేవంత్‌రెడ్డితోపాటు వీడ్కోల్ పలుకుతున్న రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచారశాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

- కూసుమంచి, డిసెంబర్ 24

## ఆరు గ్యారెంటీలు అమలుచేసి తీరుతాం..

- త్వరలోనే రాష్ట్ర ప్రజలకు మరో రెండు తీపి కబుర్లు
- మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

కూసుమంచి, డిసెంబర్ 24 : రాష్ట్రంలో ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారెంటీలను ఎంతకష్టమైనా అమలుచేసి తీరుతామని, రాష్ట్ర ప్రజలకు రెండు, మూడ్రోజుల్లో మరో రెండు తీపి కబుర్లను అందించనున్నట్లు రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచారశాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. కూసుమంచి మండలం పాలేరులో శనివారం జరిగిన క్రిస్మస్ దుస్తుల పంపిణీ కార్యక్రమంలో మంత్రి మాట్లాడుతూ పేదవాడి చెంతకు పరిపాలన అందించే విధంగా ప్రణాళిక సిద్ధం చేస్తున్నామని పేర్కొన్నారు. కష్టాల్లో ఉన్న సమయంలో తనతోపాటు ఉన్న ప్రజలను కంటికిరెప్పలా కాపాడుకుంటానని స్పష్టంచేశారు. ప్రజల అభిమానానికి రుణపడి ఉంటామని జిల్లాలో ముగ్గురు మంత్రులు అందరు ఎమ్మెల్యేలతో కలిసి ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పాలన అందిస్తామన్నారు. ఎన్నికల వరకే రాజకీయాలని, తరువాత అంతా మనవాళ్లేనన్నారు. ఇది ఫ్రెండ్లీ ప్రభుత్వమని, పేదవాడి కలను సాకారం చేయడానికి శక్తివంచన లేకుండా పని చేస్తామన్నారు. పాలేరు నియోజకవర్గంలోని 2వేల మందికి క్రిస్మస్ దుస్తులను మంత్రి పొంగులేటి పంపిణీ చేశారు. కేక్ కట్ చేసి క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. చర్చి ఫాదర్లు, సంఘ కాపరులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. 145మందికి కల్యాణలక్ష్మి చెక్కులు, విద్యుత్ బాధితులకు రూ.7 లక్షల విలువైన చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు రాయల నాగేశ్వరరావు, తంబూరి దయాకర్‌రెడ్డి, న్యాయవాది నిరంజన్‌రెడ్డి, సుడిగాలి కిషన్‌రావు, రామసహాయం అరవింద్‌రెడ్డి, ఎంపీపీలు శ్రీను, మంగీలాల్, రమ్య, జడ్పీటీసీ బెల్లం శ్రీను, తహసీల్దార్ సంపత్‌కుమార్, నాయకులు శివరామకృష్ణ, మల్లారెడ్డి, రవికుమార్, గోపాల్‌రావు, వెంకటరెడ్డి, వాసు, సుధాకర్‌రెడ్డి, రాంరెడ్డి, అశోక్, భద్రయ్య, ఈఈ వెంకటేశ్వర్లు, ఏడీఏ విజయ్‌చంద్ర, ఏడీఈ కోక్యానాయక్, నాలుగు మండలాల ఎంపీడీవోలు, తహసీల్దార్లు, ఏవోలు పాలేరు సర్పంచ్ మంగమ్మ, సీఐలు జితేందర్‌రెడ్డి, రాజిరెడ్డి, ఎస్సై రమేశ్‌కుమార్ పాల్గొన్నారు.



క్రిస్మస్ దుస్తుల పంపిణీ అనంతరం మాట్లాడుతున్న మంత్రి పొంగులేటి